# మా ఇరువురి సమస్య

— ఉండవల్లి మల్లిఖార్జునరావు

''సిగరెట్టు త్రాగుతున్నానుకాని సిగరెట్టు గురించి ఆలోచనే నన్నొదిలిపోలేదు'' గంటైనా వదిలి ఉండలేని సిగరెట్టు గురించే నా బాధంతా.

సిగరెట్టు త్రాగడమేమో నా ప్రాణం. దాన్ని వదిలి ఉండలేను. ఎన్నో చిక్కు సమస్యలకు సైతం జవాబు ఇవ్వగలిగేలా చేస్తుంది నాకు సిగరెట్టు.

అసలు సిగరెట్టు గురించి నాబాధ నా శ్రీమతి దగ్గర్నుంచే, సిగరెట్టు త్రాగితే ఒప్పుకోదు. ఆ పొగ పడదంటుంది ఇల్లంతా సిగరెట్టు పీకలని చాలా గొడవ చేస్తుంది.

నిజం చెప్పొద్దూ! ముద్దు పెట్టుకునేటపుడు కూడా సిగరెట్టు వాసనని మరీ అసహ్యించుకుంటుంది. ఆరోగ్యమొకటి పాడవతుందనీనూ.

నాకు మాత్రం మానాలని ఉండదూ కానీ, మనసులో భావానికి ప్రతీకయిందీ సిగరెట్టు అది కాల్చందే పొగరానట్టే మనసులో భావం కలగదూ ఆలోచనారాదు.

చెప్పాలంటే మాత్రం ప్రొగత్రాగితే ఆరోగ్యం చెడుతుందేమోకాని, భావాలతోటి, ఆలోచన్లతోటి మనస్సు తృప్తి పడుతుంది. చెడిన ఆరోగ్యం మందులతో బాగు చేయించుకోవచ్చేమోకాని, మనస్సుపడే తృప్తి ఎక్కడ నుంచి తీసుకురాగలం అదే నేను ఆలోచిస్తాను.

నా శ్రీమతి ఇదంతా అర్థం చేసుకోదు. సిగరెట్టు త్రాగడం హానికరం అదే దృష్టిలో పెట్టుకుని వద్దని వారిస్తుంది. వాదిస్తుంది.

పోనీ! సిగరెట్టు ఒకటే కాదు, 'టీ' కూడా అస్తమాను త్రాగుతావని చిరాకుపడుతుంది.

నాకేమో మనసులోని భావాలు 'టీ' త్రాగిన స్పుడు కదిలితే దాని వెంటనే సిగరెట్టు త్రాగితే ఆ భావాలు బయట పడతాయి.

'టీ', సిగరెట్ అలవాట్లనేవి మనం చేసే పనిమీద ఏకాగ్రత పెంచుతాయని నా నమ్మకం.

ప్రపంచంలో ఉన్నవన్నీ సత్య అసత్యం అనే రెండిటి వాటిల్లో ఏదో ఒక నచ్చిన మార్గంలో ఆలోచన్లు ఏర్పడతాయని నా భావం.

నా అలవాట్లనైతే విమర్శిస్తుంది కాని తను మాత్రం అస్తమానూ వక్కపొడి నమలదూ, నోట్లో గోరులు పెట్టుకుని కొరుక్కోదు. అవి మాన మంటే మాత్రం మానిందా? నేను ఏమైనా చెప్పేటపుడు తను ఏమైనా ఆలోచించేటపుడు నోట్లో గోరులు పెట్టుకుని కొరుక్కుంటుంది. నన్ను మాత్రం మానేయమంటుంది.

ఇవి రెండు మానేయమని ముఖ్యంగా సిగరెట్టు మానేయమని ఎంత మందితో చెప్పి నాకు చెప్పించలేదు. నాకు అవి మానేయమన్నప్పుడల్లా మనసులో భావాల్ని, ఆలోచన్ని బయట పారేయ్ అన్నట్టుండేది.

అవును మరి! ఎదుటి వారి పద్ధతుల్ని తన దృష్టిలో ఆలోచించుకుని మానేయమంటారు కాని మన దృష్టిలోంచి వాళ్ళెలాగ ఆలోచిస్తారు.

ఏది ఏమైనా మా ఇద్దరి మధ్య గొడవ మరికొంత ఎక్కువైంది. ప్రతిక్షణం నా అలవాట్ల గురించి ఆలోచించుకొనేలా తయారైంది నా పరిస్థితి.

ఎలాగైతేనేం ఓ నిర్ణయానికి వచ్చాను. నేను 'సిగరెట్, టీ' మానేసేలా తను వక్కపొడి, నోట్లో గోరులు పెట్టుకోవడం మానేసేలా. అలా ఓ ఇరవై ఐదు రోజులు గడిచిపోయాయి. ఇంతలో ఓ ఆలోచించవలసిన విషయం వచ్చిపడింది. నాకు శ్రీకాకుళం టెలిఫోను ఎక్స్ఛేంజి నుండి విశాఖ పట్నం కాని, కాకినాడ కాని ట్రాన్స్ఫర్ అవబోతుంది.

కాకినాడ నుండి పిఠాపురంలో ఉన్న మావయ్య గారి ఇంటికి దగ్గరగా ఉంటుందని నా శ్రీమతి కాకినాడ ట్రాన్స్ఫర్ అయ్యేలా ప్రయత్నించ మంటుంది. ఇక ఒక్కరోజు గడువుంది. ఏదో ఒకటి తేల్చుకుని నిర్ణయం తీసుకోవాలి.

ఆరోజు ఆదివారం ట్రాన్స్ఫర్ గురించి ఇద్దరం ఆలోచిస్తున్నాము. ఒక ప్రక్క వైజాగ్‌లో ఉండాలనే కోరిక.

అలా ఆలోచనల్లతో కొట్టుమిట్టాడుతూనే వున్నాను. ఇక ఒక నిర్ణయానికి రాబోతున్నాను. పాతిక రోజుల క్రింద మిగిలిపోయి అలమారు పైనున్న రెండు సిగరెట్లలో ఒకటి తీసుకుని వెలిగించాను. కొద్దిపాటి జంకుతో వరండాలో నుండి లోపలికి కర్టెన్ తొలగించి చూశాను.

అదే విషయం మీద గోర్లు కొరుకుతూ ఆలోచిస్తుంది నా శ్రీమతి నన్ను చూసి టకీమని తీసేసినా నేను సిగరెట్ త్రాగడం చూసి తనేమి ఫీలవడం లేదు. నేను సిగరెట్ దమ్ములాగుతూనే ఉన్నాను.

ఇంతలో తను వక్కపొడి నోట్లో వేసుకోవడం జరిగింది. నేను రెండో సిగరెట్ కూడా కాల్చే ఉద్దేశంతో ఉన్నాను.

ఈ లోపుగా 'టీ' రడీచేసి వరండాలో గ్రిల్స్ దగ్గర నిలబడి తదేకంగా పడమటని అస్తమిస్తున్న సూర్యుడ్ని చూస్తూ దమ్ములాగుతున్న నన్ను కదిపి 'టీ' అందించింది.

మానసికంగా ఎవరి అభిప్రాయాలకు, ఆలోచ న్లకు వాళ్ళు కట్టుబడి వుండాలికాని, ఎదుటి వారి పద్ధతులు నచ్చకపోతే విమర్శించకూడదు. ప్రతి మనిషికి ఓ దృక్పథం ఓ తీరు వుంటుంది. యాంత్రికంగా మార్చాలనుకోవడం క్షణికోద్రేకం లాంటిది. సిగరెట్లు సీ గురించి తగ్గిస్తాను కాని పూర్తిగా మానలేనని చెప్పాను.

నా శ్రీమతి నా ఎద మీద వాలిపోయింది. నేను ఆ అస్తమిస్తున్న సూర్యుడి వైపే చూస్తున్నాను. నాలుగు రోజులు మబ్బులు క్రమ్మి కనుమరుగై పోయినా ఐదో రోజు మామూలుగానే వచ్చేస్తాడా సూర్యుడు. సిగరెట్ చివరి దమ్ములాగి తృప్తిగా పడేశాను దానిని.

